క్రీస్తు మార్గం అనుసరణీయం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన్నారులు


కాకివాని వీధి జేసీపీఎఫ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న చర్చి నిర్వాహకులు


జేసీపీఎఫ్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలోని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఉదయం చర్చిల్లో క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి మతపెద్దలు వివరించారు. కరుణ, ప్రేమ, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి ఏసుక్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని బిషప్‌లు,పాస్టర్లు వివరించారు. కాకివానివీధి పురాతన ఏబీసీ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో సుమారు రెండువేల మంది పాల్గొన్నారు. మతపెద్ద జాన్సన్ వాక్య సందేశాన్ని వినిపించారు. ఏబీసీ చర్చి పాలక వర్గ అధ్యక్షుడు కృపానందం, కార్యదర్శి చిన్నికుమార్, కస్టోడియన్ మోజెస్, కౌన్సిల్ సభ్యుడు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. కాకివాని వీధి ఏసుక్రీస్తు ప్రార్థనా సహవాసం (జేసీపీఎఫ్)లో జరిగిన ప్రార్థనల్లో ఎంపీపీ బోదెపు గోవింద్ పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బైపాస్ రోడ్డులో ఉన్న రోమన్ కేథలిక్ చర్చిలో బాల ఏసు పుట్టుక కోసం ఏర్పాటు చేసిన పశువులపాక సెట్టింగ్ ఆకట్టుకుంది. పలుచోట్ల చర్చిల్లో యువతీ, యువకులు క్రైస్తవ గీతాలాపన చేశారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

మునగపాక : మండల వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీనిలో భాగంగా గంగాదేవిపేట చర్చిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జీవితం అనుసరణీయమని ఈ ప్రపంచానికే శాంతి సందేశం ఇచ్చిన క్రీస్తు అందరికీ ఆదర్శమని ప్రసాద్ తెలిపారు. సకల జనులకు పర్వదినమైన ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకల్లో తాను పాల్గొనడం మరువలేనిదన్నారు. ఏసుక్రీస్తు జీవితం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గంగాదేవిపేట చర్చి ఫాస్టర్ జోసఫ్ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు. ప్రసాద్‌కు పలువురు చిన్నారులు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు

ఎస్.రాయవరం: మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదగుమ్ములూరు సెయింట్‌నరీ బాప్టిస్ చర్చిలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.చర్చికి విచ్చేసి ఎమ్మెల్యే కు సంఘ కాపులు స్వాగతం పలికి ఆహ్వానించారు.క్రైస్తవ సోదరులు అంతా ఐక్యంగా ఉంటూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలు అందుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మణిరాజు, సీతారామరాజు, మాజీ జెడ్పీటీసీ కశింకోట నీలేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఎస్.రాయవరం, దార్లపూడి, కొరుప్రోలు, పెదఉప్పలం తదితర గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పలువురు సంఘ కాపరులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.కొరుప్రోలులో చీరలు,దుప్పట్లు నిరుపేదలకు అందజేశారు. మరికొన్ని చర్చిల్లో అన్న సమారాధన నిర్వహించారు.

కోటవురట్ల : మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిల్లో సందడి వాతావరణం నెలకొంది. రంగు రంగు దుస్తుల్లో చిన్నారులు మెరిసిపోయారు. పరస్పర శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసు క్రీస్తు బోధనలు వినిపించారు. మానవాళికి ఏసు బోధనలు శాంతిని ప్రబోధిస్తాయని అన్నారు. రాట్నాలపాలెంలోని క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, ఎల్‌షద్దాయ్ ఆరాధనా సంఘం, బేతస్థా ప్రార్థనా మందిరం, అనుబంధ సంఘాల చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు వస్త్రాల పంపిణీ చేశారు.

క్రీస్తు బోధనలు మానవాళికి వెలుగులు

పాయకరావుపేట : యేసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి వెలుగులని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలో గల పలు క్రీస్తు ఆరాధనా మందిరాలకు హాజరయ్యారు. పట్టణంలో పలు మందిరాల్లో ప్రసంగించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ లంక సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఆయా చర్చిల్లో పాస్టర్లు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్తపేట చర్చిలో ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు(కన్నబాబు) ఆర్థిక సాయంతో సమకూర్చిన చీరలను డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, సర్పంచ్ వానపల్లి అరుణలత జగన్, పాస్టర్ యూనియన్ నాయకులు జేమ్స్ పాల్గొన్నారు.


యలమంచిలి ఏసుక్రీస్తు ప్రార్థనా సహవాసంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ గోవింద్


కోటవురట్లలోని కేజేబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పెదగుమ్ములూరు చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


కొరుప్రోలు చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


కొత్తపేట చర్చిలో చీరలు అందజేస్తున్న సుకుమారవర్మ


యలమంచిలి ఏబీసీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భజనలు


మునగపాక సాంబశివుని ఆలయంలో భజన చేస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక సాంబశివుని ఆలయంలో సోమవారం రాత్రి ప్రత్యేక భజనా కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నాతవరం ప్రాంతానికి చెందిన భజన బృందం ఇక్కడ భజనలు చేశారు. పలు గీతాలు ఆలపించారు. గీతాలు అందరినీ అలరించాయి. ఆలయం పునర్నిర్మాణం చేపట్టిన తరువాత నాతవరం కళాకారులు ఇక్కడ భజన చేసేందుకు వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు


మునగపాకలో చురుగ్గా డ్రైనేజీ నిర్మాణం

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మునగపాక పల్లపు వీధి నుంచి గ్రామీణ యువజన మందిరం వరకు గతంలో ఉన్న డ్రైనేజీ శిథిలావస్థకు గురైంది. దీంతో నీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కారానికి జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తన కోటా నుంచి రూ.10 లక్షలు డ్రైనేజీ నిర్మాణానికి మంజూరు చేశారు. సంబంధిత పనులు వారం రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు

మునగపాక : మండల వ్యాప్తంగా మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 26, 27 తేదీల్లో వాలీబాల్, 28, 29, 30 తేదీల్లో కబడ్డీ, జనవరి 2,3 తేదీల్లో బాల్ బ్యాడ్మింటన్ లేదా షటిల్, 4,5 తేదీల్లో ఖో–ఖో అలాగే 6, 8, 9 తేదీల్లో క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

మునగపాక: సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఒంపోలులో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ సూరిబాబు,వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి, వీఆర్వో జోగినాయుడు పాల్గొన్నారు.

మామిడివాడలో భారత్ వికసిత్ సంకల్ప యాత్ర


భారత వికసిత్ సంకల్ప యాత్రలో పాల్గొన్న నాయకులు

రాంబిల్లి : మామిడివాడలో సోమవారం భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ అప్పలనర్స, ఈవోపీఆర్డీ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, నాగరాజు సచివాలయ కన్వీనర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళులు


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

అచ్యుతాపురం : దివంగత ప్రధాని వాజ్‌పేయి దేశాభివృద్ధికి కృషి చేశారని, ఆయన చేసిన సేవలు ఎనలేనివని యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు అన్నారు. అచ్యుతాపురంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వాజ్‌పేయి జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజాన రాజు, నాయుడుబాబు పాల్గొన్నారు.

రాంబిల్లి : మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా వాడనర్సాపురంలో సోమవారం ఆయన చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కారె రాముడు తదితరులు మాజీ ప్రధాని అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మాల గోవింద రెడ్డి, సూరాడ నూకరాజు పాల్గొన్నారు.


వాడనర్సాపురంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం కావాలి

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ కోరారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షునిగా నియమితులైన మొల్లేటి వినోద్ సోమవారం మర్యాదపూర్వకంగా సుకుమారవర్మను కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సుకుమారవర్మ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతంతో పాటు నియోజకవర్గంలో పార్టీ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలన్నారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కాండ్రేగుల రాజు, మండల యువజన విభాగం నాయకులు బొడ్డేడ లిల్లీ, జగదీష్, సరిసా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.


డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మకు మొక్క అందజేస్తున్న వినోద్

జోరుగా సామాజిక భవనం పనులు

మునగపాక : తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. తోటాడ పంచాయతీ సంతబయిల ఏళ్ల తరబడి శిథిలావస్థకు గురైన సామాజిక భవనాన్ని పంచాయతీ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం శ్లాబు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక అవసరాలకు అనువుగా ఉండేలా సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, దొడ్డి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


తోటాడలో సామాజిక భవనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ మంగవేణి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి

బాధిత గ్రామస్తులకు పరిహారం ఇవ్వాలి

రాంబిల్లి: నేవీ ప్రహరీతో నష్టపోతున్న పెదకలవలాపల్లి గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం మండల నాయకుడు దేముడు నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు కోరారు. ఇక్కడ మహిళలు చేస్తున్న ధర్నా శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ గ్రామస్తులకు పరిహారం అందజేయాలని కోరారు.


ధర్నా చేస్తున్న పెదకలవలాపల్లి గ్రామస్తులు

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయండి..

కోటవురట్ల : గ్రామీణ ప్రాంతంలో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి 2024 జనవరి 9వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్రా...అన్ని గ్రామ సచివాలయాలలో జరుగుతుందని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలు నిర్వహిస్తున్నామని, ఉదయం 11 గంటల నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆర్థిక అసమానతలపై సీపీఐ పోరు


టి.జగ్గంపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కోటవురట్ల : సీపీఐ పేదల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. టి.జగ్గంపేటలో సీపీఐ 98వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. దేశంలో ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు సీపీఐ సుదీర్ఘ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సహాయ కార్యదర్శి ఎం.రామునాయుడు, పార్టీ నాయకుడు సూరిబాబు పాల్గొన్నారు.

నునపర్తి చేరిన అయోధ్య రాముని అక్షింతలు

అచ్యుతాపురం : అయోధ్య నుంచి రామ స్పర్శిత అక్షింతలు మండలంలోని నునపర్తి రామాలయానికి చేరుకున్నాయి. ఈ నెల 31 వరకూ రామమంత్రోచ్ఛరణతో అక్షింతలకు పూజలు చేసి, జనవరి ఒకటో తేదీ నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి వాటిని కరపత్రం, రామమందిరం ఫొటోతో పాటు అందిస్తామని గ్రామ ధర్మరక్షా సమితి సభ్యులు తెలిపారు.


రాముని అక్షింతలను తలపై మోస్తూ రామాలయానికి తీసుకొస్తున్న భక్తులు

వృద్ధాశ్రమంలో భోజనం పంపిణీ

అనకాపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని హిమశేఖర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పరమేష్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు, మండలంలోని వెంకుపాలెం వృద్ధాశ్రమంలో వృద్ధులకు సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పండ్లు, రొట్టెలు, గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న తిరువీధి

నక్కపల్లి : మండలంలో ఉపమాకగ్రామంలో గరుడాద్రి పర్వతనంపై స్వయంవ్యక్తంగా వేంచేసి ఉన్న శ్రీ కల్కివెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సందర్భంగా సోమవారం స్వామివారు అశ్వవాహనంపై తిరువీధిసేవ నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు సంకర్షణపల్లి గోపాలకృష్ణమాచార్యులు అభిషేకాలు నిర్వహించారు. కొండ దిగువున గల ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఉపాలయాల్లో నిత్య కార్యక్రమాలు యథావిధిగా జరిగాయి. అంతకుముంతు తిరుప్పళ్ళియెళైచ్చి తిరుప్పావై సేవాకాలం, స్వామివారి ఉత్సవమూర్తులకు నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్టి, అశ్వవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను, గోదాదేవి అమ్మవారి పల్లకీలో అధిష్టింప చేసి గ్రామంలో తిరువీధిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, నందూరి వెంకటరాజగోపాలాచార్యులు, ఇల్లింద వెంకట గోపాలాచార్యులు, నందూరి వెంకట అప్పలరంగాచార్యులు, దేవస్థానం సిబ్బంది గురవయ్య, గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, యు.వి.రంనాథస్వామి, భక్తులు పాల్గొన్నారు.


అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి సేవలో అర్చకులు, భక్తులు

కమ్ముకున్న పొగమంచు


మంచు దట్టంగా అలుముకున్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల : మైదానం మంచు ముసుగేసుకుంటోంది. ఏజెన్సీ ప్రాంతానికి ఏమాత్రం తక్కువ కాదంటూ మైదానంలోనూ పొగమంచు కమ్ముకుంటోంది. దట్టంగా అలుముకున్న పొగమంచు రహదారులను కమ్మేస్తోంది. రెండడుగుల దూరంలో కూడా ఏమీ కనిపించని పరిస్థితి ఉంది. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక లైట్ల వెలుతురులో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక చలి కూడా అదే జోరు చూపిస్తోంది. సాయంత్రం అయితే చలిగాలులు వీస్తున్నాయి. దాంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు.